ఏ రోడ్డు ఎటు పోతుందో..

బొంరాస్‌పేట సమీపంలోని కూడలిలో సూచిక బోర్డులు లేని రహదారులు

◆ ప్రధాన కూడళ్లలో కనిపించని సూచిక బోర్డులు ◆ ప్రయాణికుల తికమక

బొంరాస్‌పేట, జనవరి 18 : మండలంలోని ప్రధాన కూడళ్లలో సూచిక బోర్డులు లేక ఏ రోడ్డు ఎటు పోతుందో తెలియక ప్రయాణికులు తికమక పడుతున్నారు. ప్రధాన కూడళ్లు, మలుపుల వద్ద ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ రహదారుల శాఖ అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. కూడళ్లలో ఉన్న రహదారి ఎక్కడి వరకు వెళున్నది, ఎంత దూరం ఉందనే సమాచారాన్ని తెలుపుతూ సూచిక బోర్డులు ఏర్పాటు చేసే వారు. దీంతో ప్రయాణికులు ఎలాంటి గందరగోళానికి తావు లేకుండా ప్రయాణించేందుకు అవకాశం ఉంటుంది. కూడళ్లలో సూచిక బోర్డులు లేక కొత్తగా వచ్చే ప్రయాణికులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు. అలాగే రోడ్డు మలుపుల వద్ద కూడా ప్రమాద తీవ్రతను తెలుపుతూ బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. రాత్రి సమయంలో వెళ్లే వాహనదారులకు కూడా రోడ్డు మలుపులు కనిపించేలా బోర్డులు ఏర్పాటు చేయాలంటున్నారు. వీటి ఏర్పాటుతో రాత్రిపూట ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చు. మండలంలోని బొంరాస్‌పేట నుంచి బురాన్‌పూర్ వెళ్లే రోడ్డులో జోగుకుంట సమీపంలో ఉన్న మలుపు, బొంరాస్‌పేట నుంచి తాండూరు వెళ్లే రోడ్డులో నమాజ్‌గుట్ట వద్ద ఉన్న మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. జోగుకుంట మలుపు వద్ద ఇటీవలే కారు.. బైకు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. గతంలో కూడా ఇక్కడ చాలా ప్రమాదాలు జరిగాయి. మండలంలోని ఇతర ప్రాంతాల్లో కూడా కూడళ్లలో గ్రామాల సమాచారాన్ని తెలిపే సూచిక బోర్డులతో పాటు, రోడ్డు మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ వద్దు

ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్, జనవరి 18: ప్రజలు ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ వహించరాదని, ఏ చిన్న రోగం వచ్చినా.. వెంటనే వైద్యులను సంప్రదించాలని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. గురువారం మోమిన్‌పేట మండల పరిధిలోని కేసారం గ్రామంలో హైదరాబాద్ లంగర్‌హౌస్‌లోని రెనోవా హాస్పిటల్స్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ భవనం, పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాల్లో నియమిత కాలంలో పరీక్షలు చేయించుకొని తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో సుమారు 200 పైగా ప్రజలు శిబిరంలో ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహులు, రెనోవా హాస్పిటల్స్ వైద్యులు పద్మావతి కపిల, మహ్మద్ ఆరిఫ్ హుస్సేన్, సయ్యద్ జైనుద్దీన్ రఫాయి, ఫరీద్, జహీర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్త గ్రామ పంచాయతీ భవనాలు ప్రారంభం



వెల్‌చాల్ గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన జడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్

వికారాబాద్, జనవరి 18 : గ్రామ పంచాయతీలతో ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని వికారాబాద్ జడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ అన్నారు. గురువారం మోమిన్‌పేట మండల పరిధిలోని వెల్‌చాల్, బాల్‌రెడ్డిగూడ, ఐజ్రాచిట్టంపల్లి, సయ్యద్‌అల్లీపూర్, చంద్రయాన్‌పల్లి, అమ్రాదికుర్దు గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీ భవనాలను జడ్పీ వైస్ చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీ నిర్మాణానికి రూ. 20లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. తక్కువ కాలంలోనే నూతన గ్రామ పంచాయతీ భవనాలు నిర్మాణం జరిగాయని, వీటితో ప్రజలకు పాలన మరింత చేరువ అవుతుందని తెలిపారు. గ్రామాలకు సంబంధించిన విషయాలను గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే చర్చించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వసంతా వెంకట్, ఎంపీడీవో శైలజారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌ల, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్, జనవరి 18 : మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని చైర్ పర్సన్ మంజుల అధికారులను ఆదేశించారు. స్పీకర్ ఆదేశాల మేరకు గురువారం మున్సిపల్ పరిధిలోని 7, 8, 9వ వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సారథ్యంలో వికారాబాద్ మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేస్తామని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా ముందుకు వెళ్తామన్నారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను స్పీకర్ దృష్టికి తీసుకెళ్లి మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేశ్‌కుమార్, మాజీ జడ్పీటీసీ షరీఫ్, కౌన్సిలర్లు సంతోషానర్సింహులు, గోపాల్, కమిషనర్ జాకీర్ అహ్మద్, ఏఈ రాయుడు, మున్సిపల్ సిబ్బంది ఉదయ్, కాంగ్రెస్ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రెండు రోజులు ఓటరు నమోదు శిబిరాలు

సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

బొంరాస్‌పేట, జనవరి 18 : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలో పేర్ల నమోదుకు ఈ నెల 20, 21వ తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను నిర్వహించాలని తహసీల్దార్ వెంకటేశ్ బీఎల్‌వోలకు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగా పేర్ల నమోదుతో పాటు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లు, చనిపోయిన వారి పేర్లు, రెండుసార్లు వచ్చిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవి, ఆర్ఐ రవిచారి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఇంటింటికీ రాములవారి అక్షింతల పంపిణీ

మెట్లకుంటలో అక్షింతలను పంపిణీ చేస్తున్న భక్తులు

బొంరాస్‌పేట, జనవరి 18 : మండలంలోని మెట్లకుంట గ్రామంలో గురువారం అయోధ్య రాములోరి అక్షింతలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా అక్షింతలు, శ్రీరాముడి చిత్ర పటాలను పంపిణీ చేశారు. ప్రాణ పతిష్ఠ జరిగే సమయంలో భక్తిశ్రద్ధలతో పూజలు చేసి అక్షింతలను తలపై చల్లుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నారాయణ, నర్సింహులు, దశరథ్, కృష్ణ పాల్గొన్నారు.

రైతుబంధు, రుణమాఫీ ఖాతాల్లో జమచేయాలి

పూడూరు, జనవరి 18 : సీఎం ముందుగా ప్రకటించినట్లు రైతుబంధు, రుణమాఫీ డబ్బును వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల రైతు సంఘం నాయకుడు వెంకటయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏడాదితో రెండు విడుతలుగా రైతు బంధు డబ్బులు ఇవ్వడంతో సకాలంలో విత్తనాలు, ఎరువులకు ఉపయోగపడేవని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు లక్షల రుణమాఫీతో పాటు రైతు బంధు డబ్బులు ఇస్తామని రైతులను మోసం చేశారని చెప్పారు. ప్రస్తుతం పంట సాగుకు డబ్బులు లేక చాలా మంది రైతులు ప్రైవేట్ వ్యక్తులను డబ్బుల కోసం ఆశ్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తామన్న పథకాల్లో ముందుగా రైతు బంధు, రుణమాఫీ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల కోసం రోడ్లపై ఆందోళనలు చేస్తామన్నారు.

ఇసుక తరలింపునకు అనుమతి తప్పనిసరి

తాండూరు రూరల్, జనవరి 18 : అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తాండూరు ఆర్డీవో శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో మైన్స్, పోలీసు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకర్గంలోని కాగ్నా నదిలో ఇసుక తరలించే ప్రాంతాలను గుర్తించామన్నారు. ఈ ప్రాంతాల నుంచి అధికారుల అనుమతితో ఇసుక తరలించేందుకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఒక ట్రాక్టర్ ఇసుక ధర రూ.600లుగా నిర్ణయించామన్నారు. డీడీ తీసుకొచ్చి సంబంధిత అధికారులతో అనుమతి పొందాలని సూచించారు. నియోజకర్గంలోని తాండూరు మండలం, పాతతాండూరు, ఖాంజాపూర్, వీర్‌శెట్టిపల్లి గ్రామాల సమీపంలోని కాగ్నా వాగులో నుంచి ఇసుకను తరలించవచ్చని తెలిపారు. అలాగే బషీరాబాద్ మండలం, నావాంద్గీ, గంగ్వార్ వాగులో నుంచి ఇసుకను తరలించేందుకు అనుమతలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పెద్దేముల్ మండలం రేగొండి, కొండాపూర్ గ్రామాల సమీపంలోని వాగుల నుంచి ఇసుక అనుమతులు పొందాల్సి ఉంటుందన్నారు. వే బిల్లులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మైన్స్ ఏడీ జాకబ్, డీఎస్పీ శేఖర్‌గౌడ్, సీఐ రాంబాబు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్‌రావు

పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

పెద్దేముల్, జనవరి 18 : అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 26వరకు వంద శాతం పన్నులు వసూలు చేయాలని, ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తాండూరు డీఎల్పీవో శంకర్ నాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కొండాపూర్, మదనంతాపూర్, రుక్మాపూర్ గ్రామాల్లో కొనసాగుతున్న పన్నుల వసూలు ప్రక్రియను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు పన్నులకు సంబంధించిన రసీదులను అందజేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం డీఎల్పీవో మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఆయా గ్రామాల్లో వంద శాతం పన్నులు వసూలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల పంచాయతీ కార్యదర్శులు నరేశ్, మునీరొద్దీన్, పరమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామస్తుడికి పన్ను రసీదును అందజేస్తున్న డీఎల్పీవో శంకర్ నాయక్

పీహెచ్‌సీలో అంబులెన్స్ సేవలు ప్రారంభం

కులకచర్ల, జనవరి 18: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం అంబులెన్స్ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీహెచ్‌వో చంద్రప్రకాశ్ మాట్లాడుతూ అంబులెన్స్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు, కృష్ణయ్య, చంద్రయ్య, నర్సింహులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతిలో హరినామ సంకీర్తన

తిరుమల తిరుపతి దేవస్థానంలో భజన కీర్తనలు ఆలపిస్తున్న భజన మండలి భక్త బృందం

ధారూరు, జనవరి 18: తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవారి సన్నిధిలో ధారూరు మండలంలోని కుక్కింద శ్రీఆంజనేయ భజన మండలి భక్త బృందం సభ్యులు భజన కీర్తనలు ఆలపించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆహ్వానం మేరకు ఆఖండ హరి నామ సంకీర్తన కార్యక్రమంలో భాగంగా కుక్కింద, చేవెళ్ల, పరిగి భక్తులు సైతం పాల్గొని హరినామ సంకీర్తనలు ఆలపించారు. ఈ భక్త బృందానికి టీటీడీ వారు ఉచిత వసతి ప్రసాదం స్వామి వారి దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో కుమారస్వామి, సుధాకర్, అనంతయ్య, కిష్టయ్య, పెంటయ్య, ఆంజనేయులు, నారాయణ, సంగయ్య, వెంకటయ్య, రవి, వెంకటయ్య, నందు, శ్రీనివాస్, బాల్‌రాజ్, వెంకటేశ్, ఆత్మలింగం, యాదయ్య, బీరప్ప, శ్యామయ్య, నర్సింహులు, లాలప్ప, శ్రీనివాస్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించాలి

విద్యార్థినులకు బాక్సింగ్ కిట్లు పంపిణీ చేస్తున్న ఉప సర్పంచ్ సంజీవ్‌రెడ్డి

బొంరాస్‌పేట, జనవరి 18 : దుద్యాల మండలం హకీంపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులకు ఉప సర్పంచ్ సంజీవ్‌రెడ్డి గురువారం బాక్సింగ్ కిట్లను పంపిణీ చేశారు. ఈ నెల 20, 21వ తేదీలలో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగే ఖేలో ఇండియా ఉమెన్ కిక్ బాక్సింగ్ లీగ్‌లో పాఠశాల విద్యార్థినులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం మల్లికార్జున్ విద్యార్థినులను అభినందిస్తూ జాతీయ బాక్సింగ్ పోటీలలో పాల్గొని బంగారు పతకం సాధించాలని ఆకాంక్షించారు. కిక్ బాక్సింగ్ మాస్టర్ సాయిలు, టీచర్లు పాల్గొన్నారు.

వేరుశనగ పంట దిగుబడి అంచనా

దోమ, జనవరి 18 : మండల పరిధిలోని మోత్కూర్ గ్రామంలో రైతు అంజిలయ్య సాగు చేసిన వేరుశనగ పంటను గురువారం గణాంక అధికారి సందీప్ రెడ్డి సందర్శించి పంట దిగుబడిని అంచనా వేశారు. పంట పొలంలో ఐదు మీటర్ల పొడవు, ఐదు మీటర్ల వెడల్పు విస్తీర్ణంలో పంటను హార్వెస్ట్ చేయగా 12.126 గ్రాముల దిగుబడి వచ్చిందని పేర్కొన్నారు. ఈ దిగుబడి ఆధారంగా ఎకరా పొలంలో 1,700 కేజీల దిగుబడి వచ్చినట్లు తెలిపారు. పంట దిగుబడిని అంచనా వేసుకొని తదుపరి పంట సాగుకు తగిన జాగ్రత్తలు తీసుకొని అధిక దిగుబడికి రైతులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో సాయితేజగౌడ్, రైతు అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్రప్రభుత్వ పథకాలపై అవగాహన

కులకచర్ల, జనవరి 18 : వికసిత భారత్‌లో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ అందిస్తున్న కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై తిర్మలాపూర్, అనంతసాగర్‌లో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కులకచర్ల ఎస్‌బీఐ మేనేజర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేద బడుగు బలహీనవర్గాలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. మహిళలకు ఉచితంగా ఉజ్వల గ్యాస్, ఉచిత రేషన్ బియ్యం, ముద్రలోన్స్, ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి 436, ప్రధాన మంత్రి సురక్షయోజన తది తర పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డ్వాక్రామహిళలు పాల్గొన్నారు.



తాండూరు రూరల్, జనవరి 18 : జడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు తాండూరు మండలంలోని పలు గ్రామాల్లో బోర్లు వేయించామని జడ్పీటీసీ గౌడి మంజుల అన్నారు. మండలంలోని బిజ్వార్, గోనూర్, ఉద్దండాపూర్, గౌతాపూర్, చెంగోల్, అంతారం తండా, జినుగుర్తి, ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బోర్లు వేయించామన్నారు. వేసవిలో గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు బోర్లు వేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గౌడి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

బొంరాస్‌పేట, జనవరి 18 : దుద్యాల మండలంలోని చిల్‌ముల్‌మైలారంలోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో 2024-25వ విద్యా సంవత్సరానికి 5, 6, 7, 8వ తరగతుల్లో ప్రవేశానికి మైనార్టీ అభ్యర్థులు ఫిబ్రవరి 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ మహబూబ్‌పాషా గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశానికి ముందుగా ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికి సీట్లు కేటాయిస్తారని, మిగిలిన వారికి లక్కీ డ్రా ద్వారా సీట్లు కేటాయిస్తారని తెలిపారు. 6, 7, 8 తరగతుల్లో మిగిలిన సీట్లకు కేవలం మైనార్టీ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, ముందుగా దరఖాస్తు చేసుకున్న వారికి సీట్లు కేటాయింపులో ప్రాధాన్యం ఉంటుందన్నారు. విద్యార్థులు నేరుగా పాఠశాలలో లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



యాదయ్య కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న కేఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ

కులకచర్ల, జనవరి 18 : మండల కేంద్రంలో అనారోగ్యంతో మృతి చెందిన గుడా ల యాదయ్య కుటుంబానికి కేఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఆర్థికసాయం అంద జేశారు. కేఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి అందుబాటులో లేక పోవడంతో ఆయన తల్లి రాజేశ్వరమ్మ వారి ఇం టికి వెళ్లి రూ. ఐదు వేలు ఆర్థికసాయం అందజేశారు. దీంతో పాటు రాంపూర్ గ్రామానికి చెందిన బచ్చయ్య మేస్త్రీ పని నిర్వహిస్తుండగా కిందపడి మృతి చెందగా పరామర్శించి రూ.ఐదు వేలు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో చాపలగూడెం సర్పంచ్ లక్ష్మణ్, అజయ్‌కుమార్, కాటన్‌పల్లి అంజిలయ్య, గంగ్యానాయక్, మహిపాల్, వెంకట్‌రాములు, యాదయ్య, వెంకటయ్య, రాములు పాల్గొన్నారు.

ఆరింటిలో రెండు అమలు చేశాం

ఎమ్మెల్యే బుయ్యాని

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బషీరాబాద్, జనవరి 18: ఎన్నికల ప్రచారంలో సోనియమ్మ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి రెండు గ్యారెంటీ పథకాలను అమలు చేశారని తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి అన్నారు. ఊరూరా జెండా పండుగ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని నీళ్లపల్లి, పర్వత్‌పల్లి, ఇస్మాయిల్‌పూర్, భోజ్యానాయక్‌తండా, తదితర గ్రామాల్లో పర్యటించి కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మాట్లాడుతూ.. ప్రజా పాలన కార్యక్రమం ద్వారా అర్హులను గుర్తించామని, త్వరలోనే మిగిలిన గ్యారెంటీ పథకాలను అమలు చేసి ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్, నాయకులు వెంకటేశ్ మహారాజ్, రామూనాయక్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇసుక వేలం

బొంరాస్‌పేట, జనవరి 18 : మండలంలోని మహాంతిపూర్ గ్రామ సమీపంలో ఇటీవల పోలీసులు, రెవెన్యూ సిబ్బంది స్వాధీనం చేసుకున్న ఇసుకను శుక్రవారం ఉదయం 11 గంటలకు వేలం వేస్తున్నట్లు తహసీల్దార్ వెంకటేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాల్టా చట్టం ప్రకారం టన్నుకు రూ. 600 చొప్పున వేలం వేస్తామని, ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొని ఇసుకను సొంతం చేసుకోవాలని ఆయన కోరారు.

రేపు మండల సమావేశం

తాండూరు రూరల్, జనవరి 18 : తాండూరు మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 20న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుదర్శన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అనితాగౌడ్ అధ్యక్షతన సమావేశం జరుగనున్నదని తెలిపారు. ఈ సమావేశానికి ఎమెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడి హాజరు కానున్నారని తెలిపారు. అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

పైపులైన్ లీకేజీని సరిచేయాలి

బొంరాస్‌పేట, జనవరి 18 : మండల కేంద్రం లోని భూలక్ష్మీ ఆలయం చౌరస్తా సమీపంలో మిషన్ భగీరథ పైపులైనుకు ఏర్పడిన లీకేజీని సరి చేయాలని ప్రజలు కోరుతున్నారు. పైపులైన్ లీకేజీతో రోడ్డు బురదగా మారిందని, నీటి సరఫరా నిలిచిపోతే మురుగు నీరంతా మళ్లీ పైపుల్లోకి వెళ్లి తాగు నీరు కలుషితం అవుతుందని తెలిపారు.

మాజీ వైస్ ఎంపీపీ మృతి

బొంరాస్‌పేట, జనవరి 18 : బొంరాస్‌పేట మాజీ వైస్ ఎంపీపీ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు హన్మంత్‌రెడ్డి(80) గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. మండల వ్యవస్థ ఏర్పడిన సమయంలో ఆయన మెట్లకుంట సర్పంచ్‌గా ఎన్నికై మండల వైస్ ఎంపీపీగా ఎన్నికయ్యారు. హన్మంత్‌రెడ్డి మృతి పట్ల పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-319415-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/శంకర్‌పల్లి : 91827 77665
తాండూర్/కొడంగల్ : 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962